❖•❖•❖ 7 ❖•❖•❖

# యేసు మరియు యూదా

*"ఆయన ఇంకను మాటలాడుచుండగా పండ్రెండు మందిలో ఒకడగు యూదా వచ్చెను. వానితోకూడా బహు జనసమూహము కత్తులు గుదియలు పట్టుకొని ప్రధానయాజకుల యొద్దనుండియు ప్రజల పెద్దలయొద్దనుండియు వచ్చెను. ఆయనను అప్పగించువాడు – నేనెవరిని ముద్దుపెట్టుకొందునో ఆయనే యేసు; ఆయనను పట్టుకొనుడని వారికి గురుతు చెప్పి వెంటనే యేసు నొద్దకు వచ్చి – బోధకుడా, నీకు శుభమని చెప్పి ఆయనను ముద్దుపెట్టుకొనెను" (మత్తయి 26:47-49).*

దేవున్ని ఒంటరిగా బతిమాలుచూ ప్రార్థించుట ముగించుకొని, తనను తాను సంపూర్తిగా తన తండ్రి చిత్తమునకు విధేయుడగుటకు చేసుకొనిన తీర్మానమును మనస్సులో స్థిరముగా నాటుకొని, ఆయనను సిలువ వేయనై యుండిన దౌర్జన్యపూరితమైన లోకమును కలుసుకొనుటకు యేసు నిశ్శబ్దముగా ఉండిన తోటలోనుండి వెళ్లాడు. ఆయన తన శిష్యులతో, "లెండి, వెళ్లుదము" అని చెప్పి (మత్తయి 26:46ఎ), ఆయనను పట్టుకొనవలెనని కత్తులు, గుదియలు, దివిటీలతో వచ్చిన జనసమూహమును కలుసుకొనుటకు వారిని తనతో కూడా తోట ద్వారము వరకు తీసుకొని వెళ్లాడు. ఆగ్రహముతో నిండిన గుంపు కత్తులతోను, గుదియలతోను, దివిటీలతోను ఆయనను సమీపించినప్పుడు, ఆయన వారి యొద్దకు వెళ్లి, "మీరెవని వెదకుచున్నారు?" అని అడిగెను (యోహాను 18:4బి). ఆయన వారి పట్ల కనుపరచిన తన దైవిక భావభంగిమ ప్రవర్తనను మరియు ఆయన తనను తాను వారి వశము చేసుకొనుటకు చూపించిన ఇష్టమును గమనించి వారు ఉలిక్కిపడ్డారు. గుంపును నడిపించిన వారిలో కొందరు వెనుకకు తగ్గి, వారి వెనుక నున్న వారిని గుద్దుకొన్నారు. అందువలన ఒకరి నొకరు గుద్దుకొనిన వీరందరు నిలబడుటకు బలము చాలక నేల మీద పడ్డారు.

వారు కోలుకొని మేలుకొని లేవగానే, "నేనే ఆయనని మీతో చెప్పితిని గనుక మీరు నన్ను వెదకుచున్నయెడల వీరిని పోనియ్యుడి" అని చెప్పుచూ యేసు మరలా తనను తాను వారి వశము చేసుకొన్నాడు (యోహాను 18:8).

బహుశ యూదా తాను వేసుకొన్న పథకము ప్రకారము యేసును గుర్తుపట్టుటకు ముందడగు వేసినది ఈ సమయములోనే అయియుండును. ఎవరునూ ఆయనను గుర్తుపట్టవలసిన అవసరము రాకుండునంత చమత్కారముగా యేసు ఆ పరిస్థితిని రూపొందించుకొన్నాడు. అక్కడ గుమికూడిన వారందరును ఆయన ఎవరో తెలిసికొనవలెనని ఆయన నిశ్చయించుకొన్నాడు, అట్లయినప్పటికిని వారి ఒప్పందము ప్రకారము యూదా చేయవలసిన పని చేశాడు. యూదా, "బోధకుడా, నీకు శుభము" అని చెప్పి "ఆయనను ముద్దుపెట్టుకొనెను" (మత్తయి 26:49). అప్పుడు యేసు – "యూదా, నీవు ముద్దుపెట్టుకొని మనుష్యకుమారుని అప్పగించుచున్నావా?" అని పలికాడు (లూకా 22:48). ముందుగనే వేసుకొన్న ప్రణాళిక ప్రకారము యేసును గుర్తించిన తరువాత, "సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును యేసును పట్టుకొని ఆయనను బంధించిరి" (యోహాను 18:12).

ఈ విద్రోహ చర్య విచారకరమును, యూదా ఒక పాత్ర, యేసు మరోక పాత్ర వహించుచు ఇరుపక్షములవారు ఆడిన ఒక నాటకమై యున్నది. కథలోనున్న దుష్టత్వమంతటికి – దురాశ, ప్రత్యేకావకాశములలో అత్యున్నతమైన అవకాశమును సానుకూలము చేసుకొనుటలోని వైఫల్యము, మరియు వాడు తన పని చేసుకొనునట్లు అపవాదిని అనుమతించిన విషాదాంతమునకు – యూదా ప్రతినిధియై యున్నాడు. కథలో నున్న మంచి అంతటికి యేసు ప్రతినిధియై యున్నాడు; తోటలోని ఆయన చర్యలు ఎవరినైనను అంత సులభముగా విడిచిపెట్టని ప్రేమ, ఇతరులందరు – దీర్ఘకాల స్నేహితులు సహితము – విడిచిపెట్టి వెళ్లిపోయినను చిరకాలము నిలిచియుండు ప్రేమను ప్రతిబింబించుచున్నవి. ఒక పరిశుద్ధ దేవుడు, మానవ స్వతంత్రముతో బలమైన చర్య తీసుకొని, యూదాను రక్షించుటకు చేయగలిగిన దానిలోని, సర్వస్వమును యేసు చేశాడు.

దీనిగూర్చి మనము కొంచెమాలోచించుదాము. యేసు, ఆత్మలు సంపాదించువారందరిలోకెల్ల అత్యంత గొప్పవాడు, యూదాను రక్షణ లోనికి నడిపించుటకు ఏంచేసాడు? వాడు పడి పోకుండునట్లు ఆయన పడిన ప్రయాసములో యేసు ఏం చేసాడు?

*మొదటిదిగా, యూదా హృదయము అంతకంతకు ఘోరమైనదిగాను కఠినమైనదిగాను మారుచుండినప్పటికిని వానితో కూడా నిరంతరము నిలిచియుండు ప్రేమ గల హస్తమును వానికందించుటకు దానిని వాని వైపు చాచాడు.* యూదా కథను చెప్పడము మొదలు పెట్టి త్వరగా ముగించివచ్చును. ప్రార్థనలో ఒక రాత్రి గడిపిన తరువాత (లూకా 6:12), యేసు, దైవిక ఎంపిక చేత, తన పన్నెండు మంది అపొస్తలులను ఆయన యెదుట కూడుకొని యుండిన శిష్యులలో నుండి ఏర్పరచుకొన్నాడు. దేవుని కూమారుడు ఆయనకు అత్యంత సన్నిహితమైన వారిలో ఒకడైయుండునట్లు యూదాను ఏర్పరచుకొన్నాడు. అటుతరువాత ఆయన పరిచర్యలో, యేసుతో కూడా అతడు కలిగియుండిన సహవాసములో, యేసు ఏర్పరచుకొన్నవారిలో ఒక సభ్యుడుగా జీవించుచు యూదా బ్రహ్మాండమును అద్భుతకరమునైన ఆనందానుభూతిని అనుభవించాడు. దుమ్ముపట్టిన బాటలలో వారు కలిసే నడిచారు మరియు ప్రక్క ప్రక్కనే ఉంటూ జనసమూహములకు బోధించారు. యేసు నిస్సందేహముగా అపొస్తలులకు ఆజ్ఞాపించి

యిచ్చిన పనిలో ఇతరులతో కూడా యూదాను పంపించాడు.

మొదటి నుండి కూడా, వృద్ధిలోకి వచ్చే అవకాశము, తలాంతు, మరియు ఒక మంచి అపొస్తలునిలో ఉండవలసిన లక్షణములు యూదా కలిగియుండవచ్చును. అపొస్తలత్వ గుంపంతటికి కోశాధికారిగా ఉండుటకు కూడా ఎంపిక చేయబడ్డాడు (యోహాను 13:29). ఏది ఏమైనా, మొదటి నుండి కూడా, యూదా ఏమి చేయనై యుండెనో యేసు ఎరిగియుండెను. అపవాది వాని హృదయములో నివసించునట్లు యూదా అపవాదికి చోటిచ్చాడు; రోజులు గడిచిన కొలది, దుష్టుని ఉద్దేశము యూదా అంతరంగములో ఇతోధికముగా ప్రబలమగుచుండెను. ఇతర అపొస్తలులు అప్పటికింకా దానిని వాని జీవిత కదలికలలో కనుగొనలేకపోయారు, కానీ యేసు దానిని వాని హృదయములో గమనించాడు. యేసు పరిచర్య ప్రారంభించి ఎక్కువ రోజులు గడువక మునుపే, "నేను మిమ్మును పండ్రెండుగురిని ఏర్పరచుకొనలేదా? మీలో ఒకడు సాతాను" అని ఆయన చెప్పాడు (యోహాను 6:70). ఈ వాస్తవము ఇట్లుండినప్పటికిని, యేసు యూదాను ప్రేమించి వానిని రక్షింపవలెనని ఆశించాడు.

ఆ భయంకరమును, ఆయన ముందు భయపెడుతున్నట్లు కనిపించుచు అంతకంతకు అధికమగుచుండినదియునైన తుది దైవ విధి గూర్చి యేసు యూదాను కఠోరముగానైనను లేదా ఎడతెరపిలేకుండానైనను హెచ్చరించలేదు. ప్రతి రోజు తన ప్రేమను యూదాకు కనపర్చుట ద్వారా ఆయన వాని పట్ల కలిగియుండిన యథార్థమైన ప్రేమను కేవలము అతడు కళ్లారా చూచునట్లు యూదాకు ఒక చక్కని అవకాశమిచ్చాడు. యూదాకు లభ్యమైనదాని కంటె ఉన్నతమైన ప్రత్యేకావకాశం ఇకమందు మరెవరికైనను ఎప్పుడైనను దొరకలేదు. మూడు సంవత్సరములు దేవుని కుమారునికి దగ్గరగా యూదా నడువగలిగాడు మరియు కూర్చోగలిగాడు. వాడు ఆయనను చూశాడు, ఆయనను తాకాడు, ఆయన పలికిన మాటలు విన్నాడు, మరియు ఆయన పరిపూర్ణ ప్రేమ వానికి సన్నిహితముగా నున్నట్లు గమనించాడు. యూదా హృదయములో ఏముండినదో యేసు ఎరిగియుండినప్పటికిని, ఆయన తన అపొస్తలిక సమూహములో నుండి వానిని బహిష్కరించలేదు; వానిని ప్రేమించుచు మరియు దేవుని యొద్దకు మార్గమును చూపించుచు, ఆయన వానిని అంటిపెట్టుకొనియున్నాడు.

*రెండవదిగా, జీవితము మరియు దేవుని రాజ్యమును గూర్చిన ప్రాథమిక సత్యములను యూదాకు నేర్పించుట ద్వారా వానిని రక్షించవలెనని కోరాడు.* హృదయమును ముక్కచెక్కలుగా బ్రద్దలు చేయచుండినటువంటి ఒక పోరాటములో మునిగియున్న వానికి అత్యవసరమై యుండిన పాఠములను యూదాకు నేర్పించాడు. యూదా విన్నాడు, ఉదా. కొండమీద నుండి చేయబడిన ప్రసంగమును విన్నాడు, అందులో యేసు యిలా బోధించాడు,

> భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మటయు తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయుదు, దొంగలు కన్నమువేసి దొంగిలరు. నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయము ఉండును (మత్తయి 6:19-21).

యేసు యిలా చెప్పినది కూడా వినుటకు వానికి అవకాశము దొరకినది,

> ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని

ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును (మత్తయి 6:24).

విత్తనము విత్తుటకు బయలువెళ్లిన విత్తువాని ఉపమానమును అతడు విన్నాడు. ఈ దృష్టాంతమును చెప్పుచూ, "ఐహికవిచారమును ధనమోసమును ఆ వాక్యమును అణచి వేయును, గనుక వాడు నిష్ఫలుడవును" అని యేసు వివరించాడు (మత్తయి 13:22). యేసు, ధనవంతుడు పాతాళములో బాధపడుచుండెను అని చెప్పిన, లాజరు మరియు ధనవంతుడుని గూర్చిన కథను కూడా యూదా విన్నాడు (లూకా 16:22బి, 23ఎ). ఖచ్చితముగా, యేసు ఈ మాటలన్నీ చెప్పినప్పుడు, ఆయన తలంపులలో యూదా మరియు యూదాను పోలిన యితర పేరాసగలవారును ఉన్నారు.

*మూడవదిగా, ఈ దుష్ట విద్రోహ చర్యను చేపట్టుటకు ప్రణాళిక వేయుచుండినందునకు వానిని గద్దించుట ద్వారా యూదాను రక్షించవలెనని యేసు ఆశించాడు.* యేసు యూదాతో అన్ని సందర్భాలకు అన్వయించే అంశాలను మాట్లాడని సమయము వచ్చినది గానీ త్వరితగతిన సమీపించుచుండిన అంతము గూర్చి ఆయన వానిని నిర్దిష్టముగా హెచ్చరించాడు. చివరి రాత్రి భోజన సమయములో, ఆయన యూదాను ఒక నమ్మిక ద్రోహిగా గుర్తించాడు. వారిలో ఒకడు ఆయనను అప్పగించునని యేసు సూచించిన తరువాత, "బోధకుడా, నేనా?" అని యూదా యేసునడిగెను. అందుకు యేసు, "నీవన్నట్టే" అని అన్నాడు (మత్తయి 26:25). యోహాను యేసు రొమ్మున ఆనుకొనుచు, "ప్రభువా, వాడెవడు?" అని యేసునడిగెను (యోహాను 13:25బి). అప్పుడు యేసు, "నన్ను జాగ్రత్తగా గమనించుము. నేను ఈ గిన్నెలో ఒక ముక్క ముంచి యెవనికి ఇచ్చెదనో వాడే" అను అర్థమిచ్చు జవాబిచ్చెను (యోహాను 13:26 చూడుము). ఆ తరువాత యేసు ఒక ముక్క ముంచి యూదాకిచ్చెను. "వాడు ఆ ముక్క పుచ్చుకొనగానే సాతాను వానిలో ప్రవేశించెను. యేసు – నీవు చేయుచున్నది త్వరగా చేయుమని వానితో చెప్పెను" అని యోహాను వ్రాయుచున్నాడు (యోహాను 13:27).

యేసు నిష్కపటముగా నుండెను, కానీ ఆయన బలవంతము చేయలేదు; ఆయన సరిగ్గా విషయానికి తగినట్టు మాట్లాడాడు, కానీ భోజన బల్ల యొద్ద నుండి యూదా వెళ్లిపోయి ఆయనను పట్టుకొననై యుండిన సమూహములో చేరకుండునట్లు ఆయన అతనిని నిరోధించ లేదు. ఆ నాటి భోజనము కొరకు వారందరు కూడుకొన్నప్పుడు, యూదా అదివరకే వాని హృదయయములో ఆయనను అప్పగించాడని యేసు ఎరిగియుండెను. అతడు అప్పటికే ఒప్పందమును కుదుర్చుకొన్నాడు, తీసుకొనవలసిన డబ్బు తీసుకొన్నాడు, పట్టుకొనుటకు మంచి స్థలము మరియు పరిస్థితుల గూర్చి యేసు శత్రువులకు సమాచారమును అందించుటకు అనువైన సమయము కొరకు మాత్రమే కనిపెట్టుకొని యుండెను. యేసు ఈ సంగతులన్నిటిని ఎరిగియుండినప్పటికిని, వాని మనస్సు మార్చుకొనుట మంచిదని అర్థమగుచుండినదియు, చివరదియునైన అవకాశములను వానికిచ్చుచూ, ఆయన తన అపొస్తలుని హెచ్చరించాడు.

*నాలుగవదిగా, యూదా ప్రత్యేకముగా వెలుపలికి వచ్చి ఆయనను గుర్తుపట్టవలసిన అవసరతను తొలిగించుటకు ఒక పరిస్థితిని సృష్టించుట ద్వారా వానిని రక్షించాలని యేసు అశించాడు.* యేసును పట్టుకొనుటకు జన సమూహము చేరుకొన్నప్పుడు, ఆయన వారిని కలుసుకొనుటకు వెళ్లి వెంటనే ఆయన ఎవరో వారికి తెలియజెప్పాడు. గనుక పట్టుకొనుటకు పరుగెత్తి వచ్చిన సమూహము అనుకొనని పరిస్థితి ఆకస్మికముగా ఏర్పడినందుకు

ఏంచేయాలో తెలియక చతికిలబడ్డారు – వారిని అక్కడికి నడిపించిన యూదా పరిస్థితి కూడా అంతే అయినది. మొట్టమొదట, ఏంచేయాలో అధిపతులలో ఎవరికి తెలియలేదు. యేసు కార్యసాధకముగాను శక్తివంతముగాను వారి ప్రణాళికల ప్రభావ తీవ్రతను తగ్గించాడు. "మీరు బందిపోటు దొంగ మీదికి వచ్చినట్టు కత్తులతోను గుదియలతోను బయలుదేరి వచ్చితిరా? నేను అనుదినము మీ చెంత దేవాలయములో ఉన్నప్పుడు మీరు నన్ను పట్టుకొనలేదు; అయితే ఇది మీ గడియయు అంధకార సంబంధమైన అధికారమును" అని ఆయన వారితో చెప్పాడు (లూకా 22:52బి, 53).

యేసు యూదాను దుష్టుని దురలవాట్ల గట్టిపట్టులో నుండి విడిపించి తన వైపునకు మళ్లించుకొనవలెనని తన ఇహలోక పరిచర్య యందంతటను వానితో వ్యవహరించినప్పుడు, మనము మరొకరిని రక్షణ వలయములో గల భద్రతలోనికి తెచ్చుటకు వారిని సమీపించినప్పుడు ఏంచేయడము మంచిదో అని ఆయన మనకొక మాదిరి చూపిస్తున్నాడు. మనము యేసు చర్యలను మరియు హృదయమును జోడించినప్పుడు మనము పాపములో చిక్కుకొని మన చుట్టూర ఉన్నవారి నిమిత్తము చేయుటకు చేపట్టవలసిన చర్య గూర్చి ఒక సంయుక్త చిత్రమును చూడగలము.

బానిసలుగా బంధీలైయున్నవారు, తప్పుడు త్రోవలో వెళ్తున్నారనియు మనము వారిని చేరలేక పోవచ్చుననియు మనకు తెలిసినప్పటికిని, మనము వారిని ప్రేమించవలెనని యేసు మనకు నేర్పించాడు. వారిని అంత సులభముగా విడిచిపెట్టజాలని ప్రేమను మనము వారియెడల కనుపర్చవలెను.

సరికదా, దుష్టునితో పోరాడుచున్నవారికి, జీవితము మరియు దేవుని రాజ్యమును గూర్చిన సత్యములను మనము (చేయగలిగినట్టయితే) ప్రతి రోజు వారికి నేర్పించాలని ఆయన మనకు నేర్పించాడు. మనము వారిని బలవంతము చేయకూడదు, కానీ మనము వారికి నేర్పించవలెను. మనము వారిని తగిన సమయములోను తగిన విధానములోను ఎలా హెచ్చరించాలో యేసు మనకు చూపించాడు. యేసు యూదాను వేధించలేదు; ఏదిఏమైనా, అవసరము వచ్చిన పరిస్థితి ఏర్పడినప్పుడు, దుష్టత్వము ప్రబలియున్నవాడు ఏమి చేయుచుండెనో మరియు వాని పాపము వానిని ఎక్కడికి తీసుకవెళ్లనై యుండెనో దానిని ఆయన సూచించాడు.

మనము ఎవరితో ప్రయత్నించుచున్నామో వాడు తప్పిదములను విడిచిపెట్టి సత్యమును హత్తుకొనునట్లు వానికి సులభతరము చేయు ఒక పరిస్థితిని కల్పించు నిమిత్తము మనము చేయగలిగినదంతా చేయవలెనని ఆయన చేసి చూపించాడు. నశించిన వానికి మనము మన నోటి మాటలతో మాత్రమే గాక, తప్పించుకొను మార్గమును కనుగొనుటకు సహాయపడు క్రియలలో సహితము ప్రేమను చూపించుచునే యుండవలెను.

యేసు మన కొరకు ఎంత మంచి మాదిరిని విడిచివెళ్లాడు కదా! ఒకరి హృదయము లోనికి సత్యమును చొప్పించి వారు దుష్టత్వమును విసర్జించి తనను తాను నీతికి అప్పగించుకొనునట్లు ఒప్పించుటకు వారిని ఎట్లు విజ్ఞప్తి చేయవలెనో – వారి నైతిక ఎంపికకు పరిమితమగు పరిధిలోనే – నేర్చుకొనుటకు ఇంత కంటే చక్కనైన వివరమును మనము కనుగొనలేము.

❖◆❖◆❖

*యేసుతో కూడా సన్నిహితముగా నడుచుటకు కొరకు ఉన్నతమైన ప్రత్యేకార్హత, అంతిమ ఆధ్యాత్మిక*

*నాశనమునకు వ్యతిరేకముగా భీమా హామీ ఏమీ ఇవ్వదని మనము యూదాలో చూడగలము. ఇతరులు, అదే దైవీకమైన ప్రభావముతో, నిలకడగా మేలైన విధంగా వర్థిల్లుతూవుంటే, తన వ్యక్తిగత గుణ లక్షణములో ఘోరముగా తయారైన ఒకడు ఇక్కడ మనకుండినాడు. ఒకరికి అవకాశములన్నిటిలోకెల్లా అత్యంత ఉన్నతమైన అవకాశము దొరికినను దుష్టుని ఆహ్వానమును అందుకొని వానిని వెంబడించుటకే ఎన్నుకొనవచ్చును. మన తలంపులు లేఖనములతో నిండియున్నను అదే సమయములో మన హృదయము పాపముతో నిండియుండవచ్చును; మనము పరిశుద్ధ గ్రంథమును మన హస్తాలతో పట్టుకొని కూడా వెనుక పడిపోవచ్చును.*